క్లుప్తంగా

బూచేపల్లిని కలిసిన గౌతమ్



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న గౌతమ్ అశోక్

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన వైవీ గౌతమ్ అశోక్ శనివారం చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సూచించినట్లు గౌతమ్ తెలిపారు. ఆయన వెంట అభిలాష్ యాదవ్, పెట్లూరి ప్రసాద్, ఎస్.అనిల్, గణేష్, తదితరులు ఉన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

- దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమేష్‌బాబు

నాగులుప్పలపాడు:

వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమేష్‌బాబు సూచించారు. మండలంలోని కనపర్తి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆత్మ ఆధ్వర్యంలో కనపర్తి ఎత్తిపోతల పథకం కింద ఉన్న గ్రామాల రైతులకు వరి రకాల ఎంపిక, యాజమాన్య పద్ధతులపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ మన నేలకు తగిన రకాలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఎంసీహెచ్ 103 వరి రకం చౌడు నేలలను తట్టుకునే రకమని అన్నారు. సన్న వరి రకాలను సాగుచేసుకోవడం ద్వారా త్వరగా అమ్ముకోవచ్చని తెలిపారు. వరిలో నీరు తీసి బురదలో యూరియా వేసుకోవడం వలన ఎక్కువ శాతం మొక్కకు ఉపయోగపడుతుందన్నారు. ఆఖరి దుక్కిలో 20 కేజీలు జింక్ సల్ఫేట్ వేసుకోవడం ద్వారా జింక్ లోపం రాకుండా నివారించుకోవచ్చని సూచించారు. ఒక కిలో వరి విత్తనానికి 3 గ్రాముల కార్బన్‌డిజం వాడి విత్తనశుద్ధి చేసుకుంటే అగ్గి తెగులు రాకుండా ఉంటుందన్నారు. ఉల్లి కోడు రాకుండా నారు తీసే వారం రోజుల ముందు నారుమడిలో ఒక కిలో కార్బోఫ్యూరాన్ 3జీ గులికలు వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకట్రావు, కనపర్తి ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ఈదర వెంకట కృష్ణారావు, కార్యదర్శి నడుపునేని శేషగిరిరావు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రమేష్‌బాబు

యోగాతో మానసిక ప్రశాంతత

ఒంగోలు సిటీ: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా గురువు బల్లికూర గోపీనాథ్ అన్నారు. యోగాపై రెండు రోజుల శిక్షణ తరగతులను నగరంలోని ఏబీఎం గ్రౌండ్‌లో శనివారం ఉదయం ప్రారంభించారు. నిర్వాహకుడు గంటా వెంకట్ ఆధ్వర్యంలో తొలిరోజు సుమారు 30 మంది అభ్యాసకులు హాజరయ్యారు. గోపీనాథ్ మాట్లాడుతూ మనిషి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు యోగా దోహదపడుతుందని చెప్పారు. వాకింగ్‌తో పాటు యోగా ప్రాధాన్యాన్ని కూలంకషంగా ఆయన వివరించారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, యువకులు శిక్షణకు హాజరయ్యారు.



అభ్యాసకులకు శిక్షణ ఇస్తున్న గోపీనాథ్

పదోన్నతులకు కౌన్సెలింగ్



గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీ సభ్యులు

- గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులు, బిల్లు కలెక్టర్లకు నిర్వహణ

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్–5, బిల్ కలెక్టర్ల పదోన్నతులకు కౌన్సెలింగ్ త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక దక్షిణ బైపాస్‌లోని పాత జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఈ కౌన్సెలింగ్ జరిగింది. జిల్లా పంచాయతీ అధికారి ముప్పూరి వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, జిల్లా ఆడిట్ అధికారి శంకర నారాయణరెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్–5 విభాగంలో 96 మందికి, బిల్ కలెక్టర్లు–4 కలిపి మొత్తం 100 మందికి గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోషన్లకు కౌన్సెలింగ్ జరిగింది. కౌన్సెలింగ్‌కు 92 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కౌన్సెలింగ్‌లో పాల్గొన్న అభ్యర్థులకు రెండు రోజుల్లో పదోన్నతి ఉత్తర్వులు ఇస్తామని డీపీఓ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీడీఓ రాజశేఖర్, కార్యాలయ సిబ్బంది కూడా ఉన్నారు.

పశువుల్లో వ్యాధులు గుర్తించాలి



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొత్తపట్నం: వర్షాల సీజన్ కావడంతో పశువుల్లో వచ్చే వ్యాధులను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆచార్య ఎన్జీ రంగా సర్వీస్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఆళ్ల వెంకటేశ్వరరావు సూచించారు. అందుకోసమే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని రాజుపాలెం గ్రామంలో పశు సంవర్ధక శాఖ, ఎన్జీ రంగా సర్వీస్ ఫౌండేషన్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో శనివారం పశువైద్య శిబిరం, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆచార్య రంగా సర్వీస్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు నాదెండ్ల చంద్రశేఖరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. 25 పశువులకు గర్భకోశ వ్యాధి నిర్ధారణ చికిత్సలు, 42 పశువులకు సాధారణ వైద్య సేవలు, 800 గొర్రెలకు బలవర్ధక మందులు, 125 లేగ దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు నామినేని మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, సభ్యులు నాగినేని అవనీంద్ర ప్రసాద్, ఆత్మ (ఏటీఎంఏ) ఒంగోలు ఎఫ్ఐఏసీ బీటీఎం కృష్ణా, త్రోవగుంట పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బి.బసవ శంకర్‌రావు, ఒంగోలు, కొత్తపట్నం మండలాల పశువైద్యులు డాక్టర్ అమూల్య, డాక్టర్ సోమశేఖర్, రాజుపాలెం ఎంపీటీసీ సభ్యుడు ఉప్పుటూరి కోటేశ్వరరావు, ఆచార్య ఎన్జీ రంగా సర్వీస్ ఫౌండేషన్ ప్రతినిధులు మండవ రంగారావు, మండవ శ్రీనివాసరావు, దూళిపాల వీరనారాయణ, గుండవరపు కోటేశ్వరరావు, బోడపాటి కోటేశ్వరరావు, వివిధ ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని పశుపోషకులంతా వారి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా టీకాలు వేయించాలని సంతనూతలపాడు మండల పశువైద్యాధికారి అనూరాధ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మద్దులూరు, రుద్రవరం, ఎండ్లూరు గ్రామాల్లో, 18, 19 తేదీల్లో చిలకపాడు, మంగమూరు, లక్ష్మీపురం, 20న బొడ్డువానిపాలెం, చంద్రపాలెం, 22, 23 తేదీల్లో గంగవరం, కొనగానివారిపాలెం, 24, 26 తేదీల్లో గుమ్మళంపాడు గుడిపాడు, 27 నుంచి 30 వరకు ఎనికపాడు, గురవారెడ్డిపాలెం, మైనంపాడు, అక్టోబర్ 1 నుంచి 4 వరకు పి.తక్కెళ్లపాడు, 6 నుంచి 9 వరకు సంతనూతలపాడు, 10 నుంచి 13 వరకు ఎం.వేములపాడు, మట్టిపాడు, 14 నుంచి 15 వరకు కామేపల్లివారిపాలెంలో పశువులకు టీకాలు వేస్తారని వివరించారు.

శ్మశానాల ఆధునికీకరణకు ఆమోదం

ఒంగోలు మెట్రో: నగరంలోని మూడు శ్మశాన వాటికలను మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఒంగోలు శాఖ తరఫున శుభ్రం చేసి ఆధునికీకరించేందుకు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు ఆమోదం తెలిపారు. సంస్థ చైర్మన్ మారెళ్ల సుబ్బారావు ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు శనివారం కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ పక్కన గల మహాప్రస్థానంలో ఫ్రీజర్ బాక్సులు, శాంతి రథం ఉంచేందుకు అవకాశం కల్పించాలని కోరగా, కమిషనర్ అనుమతించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు తమటం రామిరెడ్డి, అధ్యక్షులు శరభలింగాచారి, కోశాధికారి ఎం.భోజిరెడ్డి, జాయింట్ సెక్రటరీ మోటుపల్లి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు వడ్డేంపూడి సుజాతరావ్, కోసూరి శ్రీదేవి, చెరుకూరి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ ఉషు జిల్లా క్రీడాకారుల ఎంపిక



ఉషు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 69వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా ఉషు క్రీడాకారుల ఎంపిక శనివారం స్థానిక మాంటిస్సోరి పాఠశాల ఆవరణలో నిర్వహించారు. పోటీలను మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత పి.ప్రకాష్‌బాబు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు ప్రారంభించారు. అండర్ 17, అండర్ 19 పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులకు వారు తగు సూచనలు చేశారు. విజేతలైన వారు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని, క్రీడాస్ఫూర్తితో ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారితో జిల్లా అండర్ 17, 19 జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ చక్కా వెంకటేశ్వర్లు తెలిపారు.

భక్తి పరవశం..శ్రీవారికి పూజలు

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయా నమోనమఃఅంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా..గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చెన్నకేశవునికి శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవీ భూదేవి సమేతుడైన శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి వారి శాంతి కల్యాణాన్ని శనివారం స్వామివారి మధ్య రంగ మండపంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయ దేవేరులతో కలిసి స్వామి వారిని వివిధ రకాల పూలతో, ఆభరణాలతో అలంకరించిన అనంతరం ఉభయదాతలు పట్టు వస్త్రాలు సమర్పించగా ప్రధాన అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాయలసీమ జిల్లా నుంచి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు,



ఉభయ దేవేరులతో స్వామివారు

వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వర స్వామి

అర్ధవీడు: మండలంలోని మాగుటూరులో పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో స్వామి వారిని ప్రత్యేకంగా పూలు, పూలమాలలతో అలంకరించారు. హోమాలు చేశారు. తలనీలాలు సమర్పించి భక్తులు ముక్కులు తీర్చుకున్నారు. అనంతరం భజన సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడులోని ఎస్సీ, బీసీ ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సంతనూతలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సుధామణి ఆధ్వర్యంలో 37 మంది విద్యార్థులకు వైరల్ ఫీవర్‌కు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం గురించి సలహాలు, సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని వారు తెలిపారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి సుధామణి

నూతన కలెక్టర్‌కు పలువురు శుభాకాంక్షలు





కలెక్టర్ రాజాబాబుతో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, సాగర్

ఒంగోలు వన్‌టౌన్/ఒంగోలు సబర్బన్: జిల్లా నూతన కలెక్టర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన పి.రాజాబాబును పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్ ఆ శాఖ అధికారులు, సిబ్బందితో కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా హెల్ప్ సంస్థ పీడీ బీవీ సాగర్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

వాహనాలున్నా..ఉపయోగం సున్నా..



తుప్పపడుతున్న చెత్త సేకరణ రిక్షాలు

- తుప్పపడుతున్న ట్రాక్టర్, చెత్త సేకరణ రిక్షాలు

రాచర్ల: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు చెత్త తరలించడానికి మంజూరైన వాహనాలు నిరుపయోగంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహనాలు శిథిలావస్థలకు చేరుకుంటున్నాయి. మండల కేంద్రంలోని చెత్తను తరలించడానికి ట్రాక్టర్‌తో పాటు ట్రాలీ మంజూరు చేసింది. చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులకు చెత్తను తరలించేందుకు ట్రాక్టర్ వినియోగించకపోవడంతో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న పంచాయతీ కార్యాలయం పక్కనే ట్రాక్టర్ దిష్టిబొమ్మలా పడి ఉంది. అంతేకాక సచివాలయం పక్కనే ట్రాక్టర్ ట్రాలీ చిల్లకంపల్లో నిండిపోయి తుప్పుపట్టిపోతోంది. చెత్త సేకరణ కోసం రిక్షాలు మంజూరు కాగా కొద్ది నెలలుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో పంచాయతీ కార్యాలయం పక్కన వేయడంతో తుప్పుపట్టిపోతోంది. చాలా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికుల చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించకుండా ఎక్కడబడితే అక్కడ వేసి కాల్చిపడేస్తున్నారు. నిరుపయోగంగా మూలనపడిన వాహనాల గురించి ఈఓఆర్‌డీ వెంకటేష్‌ను వివరణ కోరగా ట్రాక్టర్ సంబంధించిన ట్రాలీ టైర్లు అరిగిపోవడంతో ట్రాక్టర్‌ను వినియోగించడం లేదని ఆయన తెలిపారు.



చిల్లకంపల్లో ట్రాక్టర్ ట్రాలీ